# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

గురువారం
19 మార్చి 2026




## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి..!

**పాలేరు మార్చి 18( నినాదం)**

ఉపాధి హామీ పథకం పనులను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నేల కొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు.నేలకొండపల్లి మండలం లోని కోనాయిగూడెం లో ఉపాధి హామీ పథకం పనులను బుధవారం పరిశీలించారు. కూలీల మస్టర్ ను పరిశీలించారు. కూలీల ముఖ హాజరు ను స్వయంగా సెల్ఫోన్ లో తీశారు. ఉపాధి హామీ పథకం లో వచ్చిన మార్పులను కూలీలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.పథకం యెక్క నిబంధనలు పాటించి కూలీ వేతనాలు పొందాలని సూచించారు. పని ప్రదేశాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూలీ అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
ఉపాధి,హామీ పథకం పనుల వినియోగంలో జిల్లాలోనే మండలం ఆదర్శంగా ఉండేలా ఎక్కువ మంది కూలీలు హాజరైయ్యాలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ నాగేందర్, క్షేత్ర సహాయకులు తిగుళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ఆసుపత్రి నందు ప్రసవాలు అధికంగా జరిగేలా చర్యలు**

**ఆస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నందుకు సిబ్బందికి ప్రశంసలు**

**పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**





**పెద్దపల్లి రూరల్,మార్చి-18(నినాదం):**

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని,వీటిని ప్రజలు సంపూర్ణంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి పట్టణంలోని జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు పేషెంట్స్ కి అందుతున్న సేవలు,రేడియాలజీ విభాగం, గైనకాలజీ విభాగం,లేబర్ రూమ్, ఆప్తామాలజీ విభాగం,ఆర్థోపెడిక్స్ విభాగం,ఫార్మసీ లను కలెక్టర్ పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,గర్భిణీ స్త్రీలలో ప్రసవాలు దగ్గర ఉన్న మహిళలను ఈ.డీ.డీ క్యాలెండర్ ద్వారా గుర్తించి వారికి హెల్ప్ డెస్క్ ద్వారా ముందస్తుగానే ఫోన్ కాల్స్ చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు.జిల్లా ఆసుపత్రిలో పనిచేసే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధిగా సూపరింటెండెంట్ అనుమతితో మాత్రమే సెలవుల పై వెళ్లాలని అన్నారు.
యూ.ఎస్.జి,టిఫా స్కానింగ్,ఓపి సేవల వివరాలు తెలుసుకున్న కలెక్టర్ పలు సూచనలు చేశారు.లేబర్ రూమ్లో శుభ్రత పాటించాలని అన్నారు.మేటర్ నటి వార్డులలో రోగులతో మాట్లాడుతూ,మందులు సమయానికి అందుతున్నాయా, నర్సింగ్ సిబ్బంది స్పందన గురించి ఆరాధించిన కలెక్టర్ రోగులనుంచి వచ్చిన స్పందన పై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆఫ్తామాలజి విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫాకో పరికరం పనితీరు గురించి కలెక్టర్ తెలుసుకున్నారు.ఈ పరికరం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని అవసరమైన ప్రజలు దీని ద్వారా అవసరమైన వైద్య సేవలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
నెలకు 60 నుంచి 70 వరకు ఆర్థోపెడిక్ ఆపరేషన్ ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా జరుగుతున్నాయని అన్నారు.ఫార్మసీ లో మందుల తరపున విధానం పై ఆరా తీశారు. ఫార్మసీ స్టాక్ క్రమ పద్ధతి ప్రకారం ఏర్పాటు చేయడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.
ప్రభుత్వ ఆసుపత్రిలోని వెయిటింగ్ ఏరియాలో రోగుల సౌకర్యార్థం సీటింగ్ సామర్థ్యం పెంచాలని,వ్యక్తిగత వస్తువులు పెట్టుకునేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆర్. ఎం.ఓ,కు సూచించారు
ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్,ఆర్ఎంఓ డా.విజయకుమార్ నర్సింగ్ సూపరింటెండెంట్ డా.సాయి ప్రసాద్,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విజన్ లేని విద్యా కమిషన్ రిపోర్ట్

### తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి జగన్

**ధర్మారం మార్చి 18 (నినాదం)**

ఇటీవల ఆకునూరి మురళి ప్రభుత్వానికి అందించిన విద్యా కమిషన్ రిపోర్టుకు విజన్ లేదని తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి గుండవేని జగన్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆకునూరి మురళి ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన రిపోర్ట్ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించేలా ఉందని ఈ నివేదిక ఏ రకంగాను తెలంగాణ విద్యారంగానికి ఉపయోగపడదని అన్నారు.రిపోర్టును క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉపాధ్యాయుల అభిప్రాయాలను తీసుకొని పునః సమీక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు గుర్రాల గంగారెడ్డి,డివిజన్ లోని తపస్ సంఘ భాద్యులు వనపర్తి అంజయ్య, డి.జైపాల్ రెడ్డి,శశిధర్,సతీష్,శ్రీనివాస్ రెడ్డి, ఉమశంకర్, శ్రీనివాస్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

## సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నిర్మూలించాలి

**మంచిర్యాల, మార్చి 18(నినాదం)**

సింగరేణి కార్మికుల హక్కుల సాధన-సింగరేణి సంస్థ పరిరక్షణ కొరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవ్ సింగరేణి జాతను ఆర్కే 7 గని పై ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ , సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ జెండాను ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మిక వర్గం ఐక్య పోరాటాలతో తిరిగి సాధించుకున్న కార్పొరేట్ మెడికల్ బోర్డులో గత సంవత్సరం ఏసీబీ కేసు నమోదు అయిందని సాకుతో మెడికల్ బోర్డు నిర్వహణను ఆపివేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేట్ మెడికల్ బోర్డు అవినీతి రహితంగా నడపడంలో విఫలమైన యాజమాన్యం ఏసీబీ కేసులో దొరికిన బ్రోకర్లపై కేసులు పెట్టి అదుపు చేయకుండా కుంటి సాకుతో బోర్డు ఆపి సుమారు 10 నెలలుగా బోర్డుకు అప్లై చేసిన వారిని పిలవకుండా వారు అనారోగ్యంతో డ్యూటీలు చేయలేని పరిస్థితి ఉంటే వారిపై నాగాల పేరుతో చర్యలు తీసుకోవడం అన్యాయం అన్నారు. మెడికల్ బోర్డు విషయాన్ని ప్రభుత్వం ముఖ్యమంత్రి గారి దృష్టికి గుర్తింపు సంఘంగా తాము వారి దృష్టికి తీసుకుపోయిన బోర్డు తప్పక పాత పద్ధతిలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి గారు ఇచ్చిన మెడికల్ బోర్డు హామీ అమలుకు నోచుకోలేదన్నారు . రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.50 వేల కోట్ల రూపాయలను వెంటనే ఇవ్వాలని, గుర్తింపు కార్మిక సంఘంతో స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సింగరేణి



కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ ను యాజమాన్యమే చెల్లించాలని, కొత్త గనులను వెంటనే ప్రారంభించాలని, డిస్మిస్ అయిన కార్మికులకు మరొక అవకాశం కల్పించాలని, మారు పేర్లు విజిలెన్స్ కేసుల సమస్యను పరిష్కరించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ జాత శ్రీరాంపూర్ నుండి మొదలై సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలోని కార్మికులను చైతన్యపరిచి 30వ తేదీన కొత్తగూడెంలో భారీ ధర్నా నిర్వహించి జాత కార్యక్రమాన్ని ముగించడం జరుగుతుందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయని యెడల ఏప్రిల్ నెలలో సమ్మెకు కూడా పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ఆర్కే 7 గని నుండి భారీ ర్యాలీతో కార్మికుల వాడల గుండా శ్రీరాంపూర్ చేరుకొని కార్మికుని విగ్రహానికి నాయకులు పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, ఎస్కె బాజీ సైదా, సత్యనారాయణ, మల్లేష్, కొట్టే కిషన్ రావు, మోత్కూరు కొమురయ్య, మేకల దాసు, తదితరులు పాల్గొన్నారు.



## అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు

**పెబ్బేరు మర్చి 18 (నినాదం):**

వనపర్తి జిల్లా పెబ్బేరు నుండి సుగూర్ వైపు వెళుతున్న కారు అదుపు తప్పి రహదారి పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రమాదానికి గురైన కారుకు TS10EJ2220 నెంబర్ ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ప్రయాణిస్తున్న వారు ప్రమాద సమయంలో తీవ్రంగా ఆందోళనకు గురైనప్పటికీ, అందరు క్షేమంగా బయటపడినట్లు తెలిసింది. ప్రమాద సమయంలో కారులో ఉన్న డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు. అయితే కారు కాలువలో చిక్కుకుపోవడంతో, డిక్కీ అద్దం పగలగొట్టి బయటికి వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. ప్రమాదానికి గల కారణాలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

## పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఎన్నికలు

**చింతపల్లి, మార్చి 18 (నినాదం)**

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుజాత అధ్యక్షతన బుధవారం మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఎన్నికలను నిర్వహించారు. మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడిగా ఎస్. మురళీమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఆర్. హరికృష్ణ , ఉపాధ్యక్షులుగా ఎ. మాలతి, వి. కృష్ణయ్య, కోశాధికారిగా ఆర్. నాగేంద్ర లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ సలహాదారుగా ఎంపి ఓ. ఇందూజ, మండల పరిషత్ సిబ్బంది, వివిధ గ్రామాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.







## తాడిచర్ల ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు

**మల్హార్ మార్చి 18 (నినాదం):**

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఎస్సీ కాలనీ తాడిచర్ల ప్రాథమిక పాఠశాల యందు ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు గీత ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట ప్రభుత్వ ఆదేశానుసారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ కోసం గ్యాస్ పొయ్యి మరియు సిలిండర్ కొనుగోలు చేసి ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులు ఉగాది పచ్చడి రుచి చూడడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు w. అరుణ్ కుమార్ సురేష్ నిర్వహకురాలు పద్మ మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక..!





**పాలేరు మార్చి 18( నినాదం)**

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం గురువాయిగూడెం గ్రామపంచాయతీ లొ 99 రోజుల ప్రజా పాలనా ప్రగతీ ప్రణాళిక లో భాగంగా, గురువారం సర్పంచ్ బానోత్ బిక్షం నాయక్, ఉపసర్పంచ్ పందిరి సంపత్ రెడ్డి మరియు వార్డుసబ్యులు అందరూ పాల్గొని అన్ని వార్డుల లో ర్యాలీ నిర్వహించడం జరిగింది. మరియు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించడం జరిగింది. పశువులకు ఉచిత గాలికుంటు టీకాల వేయించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ నీకాంత్ వి.ఎ.ఎస సిబ్బంది జె.వి.ఓ సరూప, ఎల్.ఎస్.ఏ ఆమెది పాషా, శ్రీనివాసరావు, జీఎంసీ భాస్కర్ రెడ్డి,లక్ష్మారెడ్డి,గోపి పశువుల టీకాలు వేయడం జరిగింది, రైతులు పందిరి వెంకట రెడ్డి, బొజ్జ నవీన్ రెడ్డి, కనకం సురేష్ మరియు పంచాయతీ సెక్రెటరీ పి.కుశ వార్డు సభ్యులు సమక్షంలో గ్రామపంచాయతీ సిబ్బంది సేవలు గుర్తించి సన్మాన కార్యక్రమం మరియు ఉగాది పండగ సందర్భంగా పట్టు వస్త్రాలు అందించడం జరిగింది.ఆర్థిక అక్షరసతో అవగాహన సదస్సు గ్రామపంచాయతీ నందు బ్యాంకు వాళ్లు వచ్చి ఇన్సూరెన్స్ వల్ల లాభాలు గ్రామ ప్రజలకు తెలియజేశారు గ్రామస్తులు ముందుకు వచ్చి ఇన్సూరెన్స్ చేయించుకున్నారు,ఈ కార్యక్రమం,ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ సునీల్ కుమార్, సీసీ హరికృష్ణ, సీఫల్ కౌన్సిలర్ కిరణ్, ఆశ వర్కర్లు,వెలుగు మహిళలు,మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక ఉగాది

**శ్రీవాణి కళాశాల అధినేతలు రేకులపల్లి సుష్మ శశాంక..**

**శ్రీవాణి కళాశాల లో ముందస్తు ఉగాది సంబరాలు**



**సుల్తానాబాద్, మార్చి 18 (నినాదం):**

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిక తెలుగువారి ఉగాది పండగ అని శ్రీవాణి విద్యా సంస్థల అధినేతలు రేకులపల్లి సుష్మ శశాంకలు స్పష్టం చేశారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వాణి డిగ్రీ, పీజీ కళాశాలలో ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి, భక్షాలు తయారు చేయడం వంటివి అతిథులను ఆకర్షించడం జరిగింది.తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్నిర్వహించి, వివిధ రకాల వంటకాలను తయారు చేసిన వా టిని విద్యార్థులు ప్రదర్శించారు. ముఖ్యంగా బీఎ స్సీ ఎంపీసీఎస్ రెండవ సంవత్సర విద్యార్థి రాజ్ కుమార్ కథాకళి గెటప్ అదేవిధంగా బీకాం రెండవ సంవత్సర విద్యార్థి రంజిత్ తెలంగాణ యుద్ధ నౌక గద్దర్ గెటప్ అందరిని ఆకర్షించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక హాజరై మాట్లాడుతూ, ఈ తరం విద్యార్థులు మన సాంప్రదాయాలను పాటించాలని తెలుపుతూ, మన పాత తరం వంటకాలను మర్చిపోకూడదని వాటిలో మన ఆరోగ్యానికి ఉపయోగపడే చాలా పోషక విలువలు ఉన్నాయని చెప్పారు.అనంతరం కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మమాట్లాడుతూ,విద్యార్థు లకు చదువుతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాలను కూడా నేర్పుతున్న అందుకు అధ్యాపక బృందాన్ని అభినందించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బండారి కమలాకర్ ,బాలసాని శ్రీనివాస్, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు

**ధర్మారం మార్చ్ 18 (నినాదం)**

మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమెన్స్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రెటరీ ఏ.జమున రాణి మరియు గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్ హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా కార్యదర్శి జమున రాణి మాట్లాడుతూ ఉగాది పర్వదినం నుండి మనకు నూతన సంవత్సరం ప్రారంభం అవుతున్నందున ప్రతీ విద్యార్థి నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ముఖ్యంగా బాలికలు ఆత్మవిశ్వాసంతో ఉన్నత విద్యలో రాణించాలన్నారు. తమ సొసైటీ ద్వారా పాఠశాలకు, మహిళలకు చేయూతను అందిస్తామని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ శ్రావణి హరీష్ మాట్లాడుతూ సమయం వృథా చేయకుండా సరైన ప్రణాళికలు రూపొందించుకొని



పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న మాట్లాడుతూ ఉగాది పండుగ ఆవశ్యకతను వివరిస్తూ ఉగాది అంటే యుగానికి ఆది, అంటే ఒక కొత్త యుగం లేదా సంవత్సరం ప్రారంభం అనీ, చైత్ర శుద్ధ పాడ్యమి నాడు బ్రహ్మదేవుడు సృష్టిని మొదలుపెట్టాడని,తెలిపారు. ఇది వసంత ఋతువు ఆరంభానికి, ప్రకృతిలో కొత్త చిగుళ్లకు సంకేతంగా జరుపుకునే పండుగ కాబట్టి దీనిని సంవత్సరాది అని కూడా పిలుస్తారని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులందరికీ అతిథులు ఉగాది పచ్చడి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న, ఉమెన్స్ డెవల్మెంట్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఏ.జమున రాణి , గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్, ఉపాధ్యాయులు గండ్రాతి శ్రీలత, అనుమల్ల శారద, చెక్కపల్లి అరుణశ్రీ,కత్తి రజిత, సేవిక,కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్,వార్డు సభ్యులు రెచవేణి మహేష్, కర్నె నరేష్,నాయకులు హరీష్, ఎదుల్ల అనిల్, అంజలి, మక్తుమ్ బీ, హసీనా విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్లో యూనిఫాం పంపిణీ

### గ్రామ సర్పంచ్ రాజయ్య

**మల్హార్ మార్చి 18 (నినాదం):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం రావులపెల్లి అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు యూనిఫామ్ ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజయ్య, వార్డు సభ్యులు, బోగే సదయ్య, దేనవేన మమత – దేవేందర్ అంగన్వాడి సెంటర్ బిస్కుల విజయ, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ రాజయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. యూనిఫామ్ల పంపిణీ ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.అం



గన్వాడి టీచర్ విజయ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం మరియు విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చివరగా చిన్నారులకు పౌష్టికాహారం అందించారు.

గురువారం, తెలంగాణ
19 మార్చి 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## వివక్షకు మారు పేరు హరీష్‌రావు

### చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఘాటు విమర్శలు



**దుబ్బాక మార్చి 18 (నినాదం):** దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావు పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, వివక్ష గురించి హరీష్ రావు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. దుబ్బాక నియోజకవర్గానికి సంబంధించిన నిధులను సిద్దిపేటకు మళ్లించలేదా? భూనిర్వాసితుల పరిహారంలో అన్యాయం చేయలేదా? అని ప్రశ్నించారు. అలాగే రంగనాయక సాగర్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసి, మల్లన్న సాగర్‌ను ఎందుకు అలానే అభివృద్ధి చేయలేదని నిలదీశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట నియోజకవర్గానికి నిధులు ఆపేశారని విమర్శిస్తున్న హరీష్ రావుకు, గతంలో దుబ్బాకపై జరిగిన వివక్ష గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఈ నెల 22న నంగనూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో, సిద్దిపేటకు ?1,070 కోట్ల నిధులు రద్దు చేశారని లేఖ రాయడం విడ్డూరమన్నారు. బీఆర్ఎస్ హయాంలో దుబ్బాక అభివృద్ధిని అడ్డుకునేలా నిధుల మంజూరులో వివక్ష చూపారని ఆరోపించారు. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల నిర్వాసితులకు ఇచ్చిన పరిహారంలో కూడా అసమానతలు ఉన్నాయని పేర్కొన్నారు. సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో ఎకరాకు ?16 లక్షలు ఇచ్చి, మల్లన్న సాగర్ నిర్వాసితులకు మాత్రం ?6 లక్షలు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకపోవడం, డిగ్రీ కాలేజీ మంజూరు చేయకపోవడం, పాలిటెక్నిక్, వ్యవసాయ కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, రింగ్ రోడ్డుకు నిధులు కేటాయించకపోవడం. ఇవన్నీ వివక్షకే నిదర్శనమని అన్నారు. దుబ్బాక ప్రజలు ఈ వివక్షను ఎప్పటికీ మరిచిపోరని, "వివక్ష అంటే హరీష్ రావు హరీష్ రావు అంటే వివక్ష" అనే భావన ప్రజల్లో బలంగా ఏర్పడిందని వ్యాఖ్యానించారు. వివక్షపై హరీష్ రావు మాట్లాడటం "దయ్యాలు వేదాలు వల్లించినట్లు" ఉందని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 లక్షలకు పైగా నిరుపేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయడం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించారని కొనియాడారు. తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలుచేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో పాలన సాగిస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా హరీష్ రావు తన తప్పు తెలుసుకొని, దుబ్బాక ప్రజలకు క్షమాపణ చెప్పి, అభివృద్ధికి అడ్డురాకుండా సహకరించాలని సూచించారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధి మా లక్ష్యం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### క్యాసారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన





**పటాన్చెరు, మార్చి 18 (నినాదం):** నియోజకవర్గం పరిధిలోని గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు మండలం క్యాసారం గ్రామంలో 10 లక్షల రూపాయల చీ=జు+ూ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు పరిశ్రమల భాగస్వామ్యంతో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రాబోయే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగీత గోవర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ మలగల వెంకటేష్, మరియు గ్రామ వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మరకత శ్రీలక్ష్మి గణపతికి విశేషపూజలు



**అల్వాల్, మార్చి 18 (నినాదం):** కనాజీగూడ డైరీ ఫామ్ రోడ్లో వెలసిన శ్రీ మరకత శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి కి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి .ఆయన మాట్లాడుతూ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయక మరకత శ్రీ లక్ష్మి గణపతి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుటకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు . ఏప్రిల్5 నుండి ఆదివారం 7 మంగళవారం వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరుపనున్నట్లు నానే తెలిపారు. ప్రత్యేక హోమాల లో పాల్గొనే భక్తులు ముందస్తుగా గోత్రనామాలతో ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని తెలియపరిచారు. పాల్గొనే వారికి హోమ వస్త్రాలు, మహా ప్రసాదాలు, గరుడ పచ్చ లాకెట్ ఉచితంగా ఇస్తారని, భోజన వసతులు కల్పిస్తారని డాక్టర్ శాస్త్రి తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నామని, భక్తుల సహాయ సహకారాలు అవసరమని పేర్కొన్నారు.

## జనసేన పార్టీలో చేరికలు



**అల్వాల్, మార్చి 18 (నినాదం):** సమాజంలో మంచి మార్పు తీసుకురావడానికి కోసం టిఆర్ఎస్ పార్టీ నుండి జనసేన పార్టీలో చేరి పార్టీతో కలిసి పని చేయనున్నట్లు రసమన్న శ్రీనివాస్ తెలిపారు. జనసేన పార్టీ నాయకులు తనకు అల్వాల్ సర్కిల్ ఇంచార్జిగా నియమించినందుకు పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనతోపాటు శ్యామ్ రావు, ప్రభాకర్, రాంబాబు, యాప్రాల్ మధు, సుజాత, తోపాటు పలువురు యువకులు జనసేన చేరినట్లు ఆయన తెలిపారు.

# పేదలకు 'రంజాన్ తోఫా' పంపిణీ

### ముఖ్యఅతిథిగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి హాజరు







**పటాన్చెరు/అమీన్‌పూర్/మార్చి 18 (నినాదం):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, సామాజిక సేవలో ముందుండే 'కైండ్ హార్ట్ ట్రస్ట్' (రిజిస్టర్ నెం. 186/2025) ఆధ్వర్యంలో అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని పేద ముస్లిం కుటుంబాలకు 'రంజాన్ తోఫా' (రేషన్ కిట్లు) పంపిణీ చేశారు. లింగమయ్య కాలనీలోని ఆటో స్టాండ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి గారు ముఖ్యఅతిథిగా విచ్చేసి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి గారు మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం ఎంతో పుణ్యకార్యమని అన్నారు. కైండ్ హార్ట్ ట్రస్ట్ (వాయిద్ ఆధ్వర్యంలో) నిర్వాహకులు సమాజం పట్ల బాధ్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని,తోటివారికి సహాయం చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ట్రస్ట్ నిర్వాహకులు మరియు సభ్యులు తనను ఆహ్వానించి, కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యూసుఫ్ గారు కూడా పాల్గొని, పంపిణీ కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించారు. కైండ్ హార్ట్ ట్రస్ట్ తరపున నిర్వాహకులు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే పేద కుటుంబాలకు అవసరమైన బియ్యం, పప్పులు మరియు ఇతర నిత్యావసర వస్తువులతో కూడిన రేషన్ కిట్లను అందజేశారు. ముఖ్యఅతిథి చేతుల మీదుగా రంజాన్ తోఫా అందుకున్న ముస్లిం సోదరీసోదరులు ట్రస్ట్ సభ్యులకు మరియు తుమ్మల పాండురంగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కైండ్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి

### • తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



**మహదేవపూర్, మార్చి 18, (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రం లోని బిజెపి నాయకులు తహసిల్దార్ రామారావు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఎద్దేవా చేశారు. ఆసరా పెన్షన్ల పెంపు, రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు 2500 మహాలక్ష్మి పథకం, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీ, వంట గ్యాస్ సబ్సిడీ లాంటి పలు రకాల హామీలను ఎన్నికలలో ప్రజలకు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని అన్నారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ చందుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించినఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బల్ల శ్రావణ్, నాయకులు కన్నెబోయిన ఐలయ్య, దడిగల వెంకటేష్, కొక్కు రాకేష్, బల్ల సంపత్, హరీష్, చంటి, రాకేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తులు పంపిణీ



**మహదేవపూర్, మార్చి 18, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని 1వ అంగన్వాడి సెంటర్ లో స్థానిక సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ చేతుల మీదుగా అంగన్వాడి విద్యార్థులకు ఏకరూప దుస్తువు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, మాస్టర్ సమ్మయ్య, అంగన్వాడి టీచర్ నాగ లతతో పాటు వార్డు సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇన్ స్పైర్ మానక్ కార్యక్రమానికి గుండాల విద్యార్థులు ఎంపిక




**గుండాల, మార్చి 18 (నినాదం):** భారత ప్రభుత్వ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలోని ఇన్‌స్పైర్ మానక్' కార్యక్రమానికి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గుండాల విద్యార్థులు జె.భార్గవి, జి.జగదీస్ ఎంపిక కావడంతో ఆ పాఠశాల జిల్లాకు కీర్తిని తెచ్చిపెట్టింది. యువతలో వినూత్న ఆలోచనలను పెంపొందించి సైన్స్ మరియు పరిశోధన రంగాలలో వృత్తిని చేపట్టేలా ప్రోత్సహించడమే ఇన్‌స్పైర్ మానక్ కార్యక్రమం యొక్క లక్ష్యం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గుండాలకు చెందిన మరో విద్యార్థిని టి.మానస ప్రతిష్ఠాత్మక జెఈఈ అడ్వాన్స్‌డ్ మెంటర్‌షిప్ కార్యక్రమానికి ఎంపికయ్యారు. భారతదేశంలోని అత్యంత పోటీతత్వ పరీక్షలలో ఒకటైన జేఈఈ లో విద్యార్థులు రాణించేందుకు, ప్రత్యేక కోచింగ్ మరియు విద్యాపరమైన అనుభవాన్ని అందించే ఈ మెంటర్‌షిప్, ఎన్ ఈ ఎస్ టి ఎస్ మార్గదర్శకత్వంలో న్యూఢిల్లీలో నిర్వహించబడుతుంది. ఈ విజయాల పట్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గుండాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది అపారమైన గర్వాన్ని వ్యక్తం చేస్తూ, గిరిజన విద్యార్థులలోని ప్రతిభను పెంపొందించడానికి మరియు వారికి ఉత్తమ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య, అవకాశాలను అందించడానికి పాఠశాల యొక్క నిబద్ధతను ఇటువంటి మైలురాళ్లు ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.

## బీజేపీ జిల్లా కార్యదర్శికి న్యాయవాదుల అభినందనలు



**చేవెళ్ల, మార్చి 18( నినాదం):** ఇటీవల బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన గౌండ్ల కృష్ణ గౌడ్‌ను చేవెళ్ల న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌండ్ల కృష్ణ గౌడ్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జిల్లా కార్యదర్శిగా, ప్రజాసేవకు వినియోగిస్తా : గౌండ్ల కృష్ణ గౌడ్**

పార్టీ బలోపేతంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని బీజేపీ జిల్లా కార్యదర్శి, న్యాయవాది గౌండ్ల కృష్ణ గౌడ్ అన్నారు. ఇటీవల బిజెపి జిల్లా కార్యదర్శి బాధ్యతలు స్వీకరించిన ఆయనను బుధవారం చేవెళ్ల న్యాయవాదులు స్థానిక కోర్టు ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ... ఆయనకు వచ్చిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు న్యాయం చేకూరేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధి, సామాజిక సేవ రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతానన్నారు. ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పనిచేయడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

### • జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా "సురక్షితమైన ఉత్పత్తులు -- నమ్మకమైన వినియోగదారులు" అనే నినాదంతో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐడిఓసి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యత లేని వస్తువులు కొనుగోలు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొనుగోలు సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకుని భద్రపరచాలని తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత వినియోగదారుల ఫోరంను సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, బిసి సంక్షేమ అధికారి ఇందిర, ఎల్దియం తిరుపతి, వ్యవసాయ అధికారి బాబూరావు, ఫుడ్ ఇన్స్ పెక్టర్ వరుణ్ రెడ్డి, డ్రగ్ ఇన్స్పెక్టర్ పావని వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, ఫిర్యాదు నమోదు విధానం వంటి అంశాలపై వివరించారు.

## పిడుగుపాటుతో చెట్టు దగ్ధం



**అమరచింత మార్చి 18, (నినాదం):** ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఏటికాడి ఆనంద్ కాంపౌండ్ లోని చెట్లపై మంగళవారం రాత్రి ఈదురు గాలులు వర్షంతో పాటు పిడుగు పడడంతో చెట్లు దగ్ధమయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది ఈ నేపథ్యంలో పిడుగు పడడంతో చెట్లు దద్ధమవడంతోపాటు ఇండ్లలోని ఫ్యాన్లు, టీవీలు,, ఫ్రిజ్ లు కాలిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పిడుగుపాటు కారణంగా తమకు లక్షల్లో నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పిడుగుపాటు కారణంగా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గంటల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గ్రామస్తుల ఆరోపించారు.

## రోగులకు పండ్లు పంపిణీ



**మహదేవపూర్, మార్చి 18, (నినాదం):** మంథని మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి జయంతిని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో బిజెపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సామాజిక ఆసుపత్రిలోరోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ రామ్ రెడ్డి ప్రజల నుంచి దూరమైన ఆయన చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరువలేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, కన్నెబోయిన ఐలయ్య, జనసేన నాయకుడు కాల్వ రాజశేఖర్, వెంకటేష్, సంపత్, రాజు, రాకేష్, హరీష్, చంటి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## హామీ నెరవేర్చిన సర్పంచ్



**మహదేవపూర్, మార్చి 18, (నినాదం):** స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ నెరవేర్చారు. గ్రామంలోని 5వ వార్డులో మంచినీటి ఎద్దడి ఉందని ప్రజలు తెలుపగా తాను గెలిచిన తర్వాత వార్డులోని త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చింది. దీంతో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా మోటర్ వేయించి నీటి ఎద్దడిని నివారించిన సర్పంచుకు వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సీతారామ 75వ వసంత నవరాత్రి ఉత్సవాలు



**అల్వాల్, మార్చి 18 (నినాదం):** శ్రీ సీతారామనామ సంకీర్తన సంఘం దేవుని అల్వాల్ వారిచే 75వ శ్రీ సీతారామ వసంత నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీ సీతారామ సంకీర్తన సంఘం వారు తెలిపారు. ఉగాది సందర్భంగా ప్రారంభోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శ్రీ సీతారామ సంకీర్ణ సంఘం కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ కంద కట్ల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరంకుశం మాధవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇవన్నీ బిగినర్స్ మిస్టేక్స్..
# జిమ్ మొదలుపెట్టి మధ్యలో మానేస్తే ?

ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది ఆరోగ్యంపై స్పృహను పెంచుకుంటున్నారు. ముఖ్యంగా ఫిట్‌గా ఉండటానికి జిమ్‌కు వెళుతున్నారు. ఇంకా నడకతోపాటు యోగాసనాలు చేస్తున్నారు. యువతలో జిమ్ ఒక సాధారణ అలవాటుగా మారింది. చాలా మంది మొదట్లో ఉత్సాహంగా జిమ్‌కు వెళ్లడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ప్రారంభిస్తారు. జిమ్ శరీరాన్ని బలోపేతం చేయడంలో సహాయపడటమే కాకుండా, ఒక వ్యక్తి మానసికంగా కూడా మెరుగ్గా భావించేలా చేస్తుంది. క్రమం తప్పని వ్యాయామం కండరాలను బలపరుస్తుంది.. ఓర్పును పెంచుతుంది, శక్తిని నిలుపుతుంది. అంతేకాకుండా, బరువును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడంలో, జీవనశైలికి సంబంధించిన అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో జిమ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఒక వ్యక్తి ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయంలో వ్యాయామం చేసినప్పుడు, వారి దినచర్య చురుకుగా ఉంటుంది.





జిమ్‌లో వివిధ వ్యాయామాలు చేయడం వల్ల శరీరంలోని ప్రతి భాగానికి వ్యాయామం అంది, మొత్తం ఫిట్‌నెస్ మెరుగుపడుతుంది. అయితే, కొంతమంది సమయం లేకపోవడం, బద్ధకం లేదా ప్రేరణ లేకపోవడం వల్ల జిమ్‌ను మధ్యలోనే మానేస్తారు. దీనివల్ల శరీరానికి కలిగే ప్రయోజనాలు క్రమంగా తగ్గి, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది అనేక సమస్యలకు కూడా దారితీయవచ్చు. దీని గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

**జిమ్ ప్రారంభించి, మధ్యలోనే మానేయడం వల్ల శరీరానికి ఎలా హాని కలుగుతుంది?**


ఆర్ఎంఎల్ హాస్పిటల్ మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి, జిమ్ ప్రారంభించి మధ్యలోనే మానేయడం వల్ల శరీరంపై ప్రతికూల ప్రభావాలు పడతాయని వివరిస్తున్నారు. ఒక వ్యక్తి క్రమం తప్పకుండా వ్యాయామం చేసినప్పుడు, శరీరం దానికి అలవాటు పడటం ప్రారంభిస్తుంది. అయితే, అకస్మాత్తుగా జిమ్ మానేయడం ఈ సమతుల్యతను దెబ్బతీస్తుంది. కండరాల బలం క్రమంగా తగ్గిపోతుంది, ఓపిక కూడా క్షీణించవచ్చు.. అని తెలిపారు.

అదనంగా, జీవక్రియ మందగించి, బరువు పెరగడానికి దారితీయవచ్చు. మీ శరీరంలో మీరు ఒకప్పుడు అనుభూతి చెందిన శక్తి, చురుకుదనం కూడా తగ్గిపోతుంది. ఎక్కువ కాలం పాటు జిమ్‌కు వెళ్లకపోవడం వల్ల ఫిట్‌నెస్ స్థాయిలు పడిపోయి,

తిరిగి సాధారణ స్థితికి రావచ్చు. ఇది అనేక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది.

**జిమ్ మధ్యలోనే మానేస్తే ..**

జిమ్‌ను మధ్యలోనే మానేయడం వల్ల చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అనేక సమస్యలు తలెత్తవచ్చు.



నీరసం, అలసట పెరగవచ్చు, బరువు పెరగవచ్చు, కండరాలు వదులవ్వవచ్చు. అంతేకాకుండా, జిమ్ ద్వారా ఒత్తిడిని తగ్గించుకునేవారు మానసిక ప్రభావాన్ని కూడా అనుభవించవచ్చు. నిద్ర విధానాలు కూడా ప్రభావితం కావచ్చు.. రోజంతా మీకు శక్తి లేనట్లు అనిపించవచ్చు. కొన్ని సందర్భాల్లో, మీరు కండరాలు బిగుసుకుపోవడం, బలహీనతను కూడా అనుభవించవచ్చు. అందువల్ల, జిమ్‌ను మానేయడం అనేది క్రమంగా, ప్రణాళికతో చేయాలి.

**ఏం చేయాలి?**

ఏదైనా కారణం చేత మీరు జిమ్‌కు వెళ్లలేకపోతే, మీ వ్యాయామాన్ని పూర్తిగా ఆపవద్దు. ఇంట్లోనే మీ దినచర్యలో తేలికపాటి వ్యాయామం, యోగా లేదా నడకను చేర్చుకోండి. మీ శరీరాన్ని చురుకుగా ఉంచుకోవడానికి క్రమంగా మీ వ్యాయామ అలవాటును పెంచుకోండి.

అదనంగా, మీ బరువు, శక్తి స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి సమతుల్య ఆహారం తీసుకోవడం ముఖ్యం. సమయం తక్కువగా ఉంటే, చిన్నపాటి వ్యాయామాలు కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే, శారీరక శ్రమను అకస్మాత్తుగా ఆపకుండా, ఏదో ఒక రూపంలో మీ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.

## ఏడాది పర్వాలకు
# ఆది పండుగ ఉగాది

ఏడాది పండుగ, ఉగాది పండుగ అనే దేశ్య నామాలతో వ్యవహరింపబడే సంవత్సరాది పర్వము, ఏటా రానున్న ఎన్నతగిన ఏభై పైచిలుకు పండుగలలో మొదటిది. తెలుగువారు తమ సంవ త్సరాదిని చాంద్రమాన గణనాధారంగా చైత్ర శుక్ల ప్రతిపదతో ప్రారంభించడం సనాతన ఆచారం. చైత్ర శుక్ల పాడ్యమి సంవత్సరాది అని బ్రహ్మపురాణం కంఠోక్తిగా చెపుతున్నది. అలాగే ఈదినం నుండి సృష్టి ప్రారంభింపబడి, ఆయా దేవతలకు సంబంధిత పనులను బ్రహ్మ అప్పగించినట్లు పురాణ కథనం.



శాలివాహన శకానికి మొదటి దినం చైత్ర శుక్లపక్ష పాడ్యమిగా భావించబడు తున్నది. వనవాసానంతరం శ్రీరాముడు సీతా, లక్ష్మణ సహి తంగా అయోధ్యకు ఈనాడే తిరుగు ప్రయాణమై నట్లు పురాణ లిఖితం. వసంత కాలారంభ దినాలలో చైత్ర శుద్ధ పాడ్యమి నాడు సంవత్సరాది పర్వం జరిపే ఆచారం ఆర్యుల్లో అతి ప్రాచీన కాలం నుండి ఉన్నది. పార్సీలు ఉగాదిని "నౌరోజ్" అంటారు. నౌరోజ్ అనగా కొత్తదినం. ఉగాది పర్వా చరణ విధానాలను నూతన సంవత్సర కీర్తనాద్యా రంభం, ప్రతి గృహ ధ్వజారోహణం, నింబ వ్రతాశనం, సంవత్సరాది శ్రవణం, నవరాత్రి ఆరంభమని ధర్మసింధువు స్పష్టం చేస్తున్నది. ప్రతిగృహ ధ్వజారోహణం, అబ్బాది తైలాభ్యంగం, నవవస్త్రాభరణ ధారణం, ఛత్రచామరాది స్వీకారం, ఉమామహేశ్వర పూజ, దమనేన బ్రహ్మపూజనం, సర్వాపచ్ఛాంతికర మహాశాంతి, నింబ కుసుమ భక్షణం, పంచాంగ పూజ, శ్రవణం, ప్రపాదాన ప్రారంభం, రాజదర్శనం వాసంత నవరాత్రి ప్రారంభం...పది విధాయక కృత్యాలుగా చెప్పబడినాయి.

**వసంత నవరాత్రుల ప్రారంభం**

చైత్ర వైశాఖమాసాలు వసంత రుతువుకాగా, చైత్రమాస తొలిరోజు ఉగాదితో వసంతరుతు ఆరంభం కాగలదు. చైత్రానికి మధుమాసమని, వసంతమాసమని పేరు. "మధుశ్చ మాధవశ్చ వాసంతి కావృత్" అనే యజుర్వేద వాక్యాన్ని బట్టి వేదకాలంలో చైత్రానికి మధుమాసమని పేరున్నట్లు తెలుస్తున్నది. రుతురాజైన వసంతునికి స్వాగతోప చారాలు చేయడానికి తొమ్మిది రోజులను నిర్దేశిం చారు. ఉగాదినాడు కలశ స్థాపన చేసి, నవరాత్ర పూజ చేస్తే అపమృత్యు భయముండదని ధర్మ సింధు వివరిస్తున్నది.

వాత్స్యాయన కామ సూత్రాలలో ఈ ఉత్సవం "సువ సంతక"మని, "మదనోత్సవ"మని పేర్కొనబడింది. రుతురాజైన వసంతుని పూజిస్తే కాలాత్మకుడైన పరమ శివుడు ప్రసన్నుడు కాగలడని భావన. వసం తోత్సవాలు తెలుగు నేలపై గొప్పగా జరిగేవి. ఉత్సవ సందర్భంగా రాజ దర్బారుల్లో ప్రతిదినం నృత్యాలు, నాట్యాలు పాట కచ్చేరీలు, పండిత గోష్ఠులు, శాస్త్ర విచారణలు, నాటక ప్రదర్శనలు జరిగేవి. సంగీతం ప్రధానంగా ఉండేది. ఆకాలాన ఉప యుక్తమైన వసంత రాగమును మేళకర్తలు ప్రత్యేకంగా కూర్చారు. రెడ్డిరాజుల, విజయనగర రాజుల కాలంలో ఉద్యానవనాల్లో మామిడి చెట్టుకింద మంటపం, దానిపై కలశం నెలకొల్పి పూజాపీఠంపై వసంతుని, రతీ మన్మధులను, లక్ష్మీ నారాయణులను, గౌరీ శంకరులను, శచీ పురంధరులను నెల కొల్పి, మంగళ వాద్యాల, వారాంగనల నృత్యాలు పన్నీరు, వసంతం చల్లుకోవడం, విద్యా వినోదాలు, క్రీడా ప్రదర్శనలు జరిగేవి. ప్రభువు హయారూఢుడై ఊరేగి వచ్చి, ఉద్యానవనంలో మంటపం వద్ద దేవతలను పూజించేవాడు. మంగళ వాద్యాలు, వారాంగనల నృత్యాలు, పన్నీరు, వసంతం చల్లుకోవడాలు, విద్యా వినోదాలు, వినోద క్రీడలు జరిగేవి.

**ఏరువాక ప్రారంభం**

ఉగాదినాడు కొన్ని ప్రాంతాలలో ఏరువాక సాగడం ఆచారం. ఎద్దులను కట్టి దున్నుటకు సిద్ధపరిచిన నాగలిని "ఏరువాక" అంటారు. రైతులు ఉగాది నాడు తలంటి పోసుకుని, బొట్టు పెట్టుకుని, కొత్తబట్టలు వేసుకుని, నాగలికి పాత తాళ్ళు తీసి, పసుపురాచిన కొత్తవి కట్టి, నాగలికి, కాడికి రావి మండలు కట్టి, ఎడ్లకు పసుపురాసి, కుంకుమ పెట్టి పూజించి, కొబ్బరికాయ కొట్టడం సాంప్రదాయాచరణ. ఉగాది నాడు కారణాంతరాల వల్ల ఏరువాక సాగకపోతే మంచిరోజుతో ప్రారంభించ బడాలి. ఏరువాక సాగ నిదే కొత్త ఏడు ఎడ్లచేత వ్యవసాయ పనులు చేయించరు.

తెలంగాణలో కొన్ని ప్రాంతాలలో ఈనాటి సాయంత్రం ఊరిలోని బండ్లను అలంకరించి మంచి ఎడ్లను పూన్చి కొంతదూరం ఊరేగిస్తారు. చైత్ర శుద్ధ పాడ్యమినాడు విద్యా, పౌరుష, ప్రతిపత్ తిలక, ధనావ్యాప్తి, సర్వాప్తి, చతుర్యాగ, చతుర్మూర్తి దేవమూర్తి, నదీ, లోక, శైల, సముద్ర, ద్వీప, సప్త మూర్తి, సప్తసాగర మున్నగు వ్రతాలను అచరించా లని చతుర్వర్ణ చింతామణిలో పేర్కొనబడింది.

**ఉగాది పచ్చడి**


"యద్వర్షాదా నింబసుమం, శర్కరామ్ల ఘృతై ర్యుతమ్, భక్షితం పూర్వయామేస్యా, త్తద్వర్షం సౌఖ్యదాయకమ్". అని పెద్దల ఉవాచ. ఉగాది నాడు ఆ ఏటి వేపపువ్వు, చక్కెర (లేదా కొత్తబెల్లం), చింత పండు, నెయ్యి కలిపి చేసే పచ్చడిని మొదటి జాము నందే తింటే ఆ వత్సరమంతా సుఖంగా జరుగు తుందని విశ్వాసం. వేపపువ్వు ప్రధాన ద్రవ్యంగా చేసే పచ్చడి గొప్ప ఔషధంగా భావించ బడుతుంది.

-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...
9440595494

## అందరి ఆకలి తీర్చాలన్నదే
# అమావాస్య అన్నప్రసాద వితరణ
## సనాతన ధర్మ ప్రచార సమితి అంతిమ లక్ష్యం



**కోరుట్ల, మార్చి 18,(నినాదం):** అందరి ఆకలి తీర్చాలనే అమావాస్య అన్నప్రసాద వితరణ సనాతన ధర్మ ప్రచార సమితి అంతిమ లక్ష్యంగా పని చేస్తుంది. ఇందులో భాగం కోరుట్ల పట్టణ సనాతన ధర్మ ప్రచార సమితి అమావాస్య అన్నప్రసాద సేవ కమిటీ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ శ్రీ పంచముఖ హనుమాన్ ఆలయం ప్రాంగణంలో బుధవారం భక్తులు, దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో సుమారు 1000 మందికి పైగా భక్తులు, 150 మంది దీక్షా పరులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



అన్నదానం మహత్తును చాటేలా ప్రశాంతమైన వాతావరణంలో భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయశీ అర్చకులు దివాకర్ శర్మ వైదిక నిర్వహణలో గోపూజ, అన్నపూర్ణ మాత పూజలు నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణ మాత ఆశీస్సులతో అన్నప్రసాద వితరణ చేశారు. "ఎవరూ ఆకలితో ఉండకూ డదు" అనే సంకల్పంతో, అమావాస్యన పితృదేవతల తృప్తి కోసం చేపట్టిన ఈ కార్యక్రమం సమాజంలో సేవాభావాన్ని బలపరిచిందని నిర్వాహకులు తెలిపారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల ముఖాల్లో కనిపించిన సంతృప్తే నిజమైన సంతృప్తి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సనాతన ధర్మ ప్రచార సమితి ప్రతినిధులు మాట్లాడుతూ అన్నింటిలో కెల్లా ఉత్తమమైంది అన్నదానం అని, భవిష్యత్తులో నిరంతరం ప్రతి అమావాస్య నాడు సేవా కోరుట్ల పట్టణంలోని ఏదో ఒక ప్రదేశంలో కొనసాగిస్తామని తెలిపారు. ఈ పవిత్ర సేవా కార్యక్రమానికి సహకరించిన దాతలు, స్వచ్ఛంద సేవకులు, అర్చకులు నిర్వాహకులకు సనాతన ధర్మ ప్రచార సమితి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ లు మోర్లాడ్ లక్ష్మీనారాయణ, తెడ్డు శ్రీజ విజయ్, సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు మంచాల జగన్, కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద సేవ కమిటీ చైర్మన్ వనపర్తి చంద్రమోహన్, కోశాధికారి మంచాల రమేష్,కమిటీ సభ్యులు, సాడిగే మహేష్, కంతం సదాశివ్, కట్కం రంజిత్, కొండ బత్తిని అనంత కృష్ణ ప్రసాద్, శ్రీపతి రమేష్, పల్లెర్ల మహేందర్, స్వచ్ఛంద సేవకులు వనపర్తి ఆంజనేయులు, కొత్త గణేష్, ఆడెపు నరేష్, అడువాల ప్రభాకర్, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి
## డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో , మార్చి 18( నినాదం):** జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి అమలు, పురోగతి పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ, విద్య, ఇతర రుణాల లక్ష్యం 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు రుణం ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్ ల్లో వినియోగంలో లేని ప్రభుత్వ ఖాతాల వివరాలు తెలుపాలని, కేవైసీ అప్డేట్ చేయించాలని సూచించారు. ఆర్ సేథీ ఆధ్వర్యంలో ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో ఆరా తీశారు. వివిధ శాఖలు, పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వాలని, స్వయం ఉపాధి పొందేలా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలపై సమీక్ష చేశారు. మహిళలు తీసుకుంటున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంక్ లలో అందించే సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, ఆర్బీఐ ఏజీఎం రాములు సబావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ ఏజీఎం సురేష్ కుమార్, టీజీబీ ఆర్ ఎం రాజ నరేంద్ర, డీఆర్డీఓ గీత, డీ వీ హెచ్ ఓ రవీందర్ రెడ్డి, డీ వో ఓ అఫ్జల్ బేగం, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో కమర్షియల్ సెగ...
## హోటళ్లకు కట్టెల పొయ్యే దిక్కు
## పది రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న హోటల్ యజమానులు

**హుస్నాబాద్,మార్చి 18 (నినాదం):** హుస్నాబాద్ పట్టణంలో గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. గత కొద్దిరోజులుగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో హోటల్ రంగం కుదేలవుతోంది. ఒకవైపు పెరిగిన ధరలు, మరోవైపు సిలిండర్ల లభ్యత లేకపోవడంతో హోటల్ యజమానులు లబోదిబోమంటున్నారు. గ్యాస్ దొరకక పట్టణంలోని కొన్ని చిన్న తరహా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో మరికొందరు యజమానులు పాత కాలం నాటి పద్ధతిని ఆశ్రయిస్తున్నారు. హోటళ్ల బయట కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసి వంటలు చేస్తున్నారు. సమయానికి టిఫిన్లు, భోజనాలు అందక వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. , సిలిండర్ కోసం ఫోన్ చేస్తే స్టాక్ లేదంటున్నారు. రోజువారీ గిరాకీ పోతే మా బతుకులు కష్టం. అందుకే చేసేది లేక కట్టెలు కొనుక్కొచ్చి పొయ్యి రాజేస్తున్నాం. దీనివల్ల వంట ఆలస్యం అవుతోంది, కళ్ళల్లో పొగ పడి ఇబ్బందిగా ఉంది, కానీ తప్పడం లేదు. వ్యాపారస్తుల అవసరాలను గుర్తించి, వెంటనే కమర్షియల్ గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని హుస్నాబాద్ హోటల్ యజమానుల డిమాండ్ చేస్తున్నారు. లేదంటే



మరికొన్ని రోజుల్లో పట్టణంలో మెజారిటీ హోటళ్లు మూతపడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


# జియో గుడ్‌న్యూస్..
# రోమింగ్‌ప్యాక్ లేకపోయినా ఓటీపీలు

ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఇంటర్నేషనల్ ట్రావెలర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. వైఫై కాలింగ్ ఆప్షన్ ద్వారా ఉచితంగా ఇన్‌కమింగ్ ఎస్సెమ్మెస్‌లు పొందే సదుపాయం కల్పిస్తోంది. ఇందుకోసం ఎలాంటి ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సిన అవసరం లేదు. అంటే విదేశాల్లో ఉన్నప్పుడు ఎలాంటి రుసుములూ లేకుండానే బ్యాంకు ఓటీపీలు, బ్యాంకింగ్ అలర్ట్‌లు వంటివి పొందొచ్చని 'ఫోన్ అరెనా' పేర్కొంది. వైఫై నెట్‌వర్క్‌కు కనెక్ట్ అయ్యుండి, తమ స్మార్ట్‌ఫోన్‌లో వైఫై కాలింగ్ సదుపాయాన్ని యాక్టివేట్ చేసుకున్న యూజర్లు ఈ సదుపాయాన్ని పొందొచ్చు. అంటే కేవలం ముఖ్యమైన సందేశాలు పొందడం కోసం ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ సదుపాయం తప్పిస్తుంది. ముఖ్యంగా విదేశాల్లో ఉన్నప్పుడు బ్యాంకు ఓటీపీలు, లావాదేవీలకు సంబంధించిన సమాచారం, ఏదైనా అకౌంట్‌లోకి లాగిన్ అవ్వాల్సిన సందర్భంలో వెరిఫికేషన్ సందేశాలు అవసరం అవుతుంటాయి. అలాంటప్పు డు మొబైల్‌లో ఈ సదుపాయం యాక్టివేట్ చేసుకుంటే సరిపోతుంది. అయితే, దేశీయంగా ఏదైనా రీఛార్జి ప్లాన్ యాక్టివ్‌లో ఉండాలి. అలాగే, వైఫై కాలింగ్ సదుపాయానికి ఆ స్మార్ట్‌ఫోన్ సపోర్ట్ చేస్తుండాలి.




# ఆంథ్రోపిక్ సంచలనం..
# ఫోన్ సాయంతో రిమోట్‌గా పీసీతో పని!


ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ మరో సంచ లనం సృష్టించేందుకు సిద్ధమైంది. తన ఏఐ అసిస్టెంట్ క్లాడ్‌లో కొత్త సదుపాయం తీసుకొచ్చింది. దీని సాయంతో మీరు ఇంట్లో లేకపోయినా మీ పీసీతో పనిచేయించొచ్చు. స్మార్ట్‌ఫోన్ సాయంతో మీ పీసీని రిమోట్‌గా నియంత్రించొచ్చు. 'క్లాడ్ డిస్‌ప్యాచ్'గా కంపెనీ ఈ ఫీచర్‌కు నామకరణం చేసింది. ఉదాహరణకు ఆఫీసు నుంచి మీ సొంత పనిమీద బయ టకు వెళ్లారనుకుందాం. తిరిగి వస్తుం డగా ట్రాఫిక్‌లో చిక్కుకు న్నారు. ఆఫీసు కొచ్చిన వెంటనే రిపోర్ట్ తయారుచేసి ప్రజంటే షన్ ఇవ్వాలి. కానీ, అంత టైమ్ లేదు. అప్పుడు మీ ఫోన్ నుంచే రిపోర్ట్ తయారుచేయ వచ్చు. మీ డెస్క్‌టాప్‌కు




ఫలానా ఫోల్డర్‌లో ఉన్న సమాచారం ఆధారంగా రిపోర్ట్ తయారుచేయాలని క్లాడ్‌ని అడగొచ్చు. మీరొచ్చేలోపు క్లాడ్ ఆ పని సిద్ధం చేసి పెడుతుంది. ఆంథ్రోపిక్ టెక్నికల్ స్టాఫ్ మెంబర్ ఫెలిక్స్ రీసెబర్గ్ ఈ కొత్త ఫీచర్‌ను పరిచయం చేస్తూ ఎక్స్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. దీన్ని వినియోగించాలంటే క్లాడ్ డెస్క్‌టాప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్‌తో పెయిర్ చేయాలి. మీరు మొబైల్ నుంచి ఆదేశాలు ఇచ్చే సమయంలో పీసీ ఆన్‌లో ఉండాలి. ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యి ఉండాలి. ప్రస్తుతానికి క్లాడ్ మ్యాక్స్ సబ్‌స్క్రైబర్లకు, రీసెర్చ్ ప్రివ్యూగా అందుబాటులో ఉంది. త్వరలో ప్రో సభ్యులకు అందుబాటులోకి తేనున్నారు.

## ఉద్రిక్తతల వేళ హ్యాట్రిక్ లాభాలు..
# ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. ఓ వైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా సూచీలు రాణించడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, క్రూడాయిల్ ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం వంటివి పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్ల మేర లాభపడింది. మదుపర్ల సంపద కూడా దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2100 పాయింట్లు పైకెగిసింది. సెన్సెక్స్ 76,367.55 పాయింట్ల వద్ద ఉదయం (క్రితం ముగింపు 76,070.84) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 77 వేల పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 633 పాయింట్ల లాభంతో 76,704.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 196.65 పాయింట్ల లాభంతో 23,777.80 వద్ద



ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి: దేశీయ కరెన్సీ రూపాయి మరింత పతనమైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ తొలిసారి 92.50 దాటింది. 92.65 వద్ద జీవనకాల కనిష్ఠానికి చేరింది.

**మార్కెట్ లాభాలకు కారణాలు ఇవీ..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కాస్త దిగి రావడం సానుకూల ప్రభావం చూపింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ దాదాపు 1 శాతం మేర క్షీణించి 102 డాలర్ల వద్ద కొనసాగుతోంది. తుర్కియేలోని సెహాన్ పోర్టు ద్వారా చమురు ఎగుమతులు చేపట్టేందుకు ఇరాక్ ప్రభుత్వం, కుర్దిష్ అధికారుల మధ్య ఒప్పందం కుదరడంతో చమురు ధరలు కాస్త శాంతించాయి. వాల్‌స్ట్రీట్ నిన్న లాభాల్లో ముగిసింది. దీంతో ఆసియా మార్కెట్లు సహా మన మార్కెట్లూ రాణించాయి. వడ్డీ రేట్లకు సంబంధించి ఈ రాత్రికి అమెరికా ఫెడ్ నుంచి వచ్చే ప్రకటన ఆధారంగా మార్కెట్ల తదుపరి గమనం ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. యుద్ధం కారణంగా మొదటి రెండు వారాలు మన మార్కెట్ భారీ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. బెంచ్‌మార్క్ సూచీలు దాదాపు 10 శాతం మేర క్షీణించాయి. ఈ క్రమంలో ఆయా స్టాక్స్ విలువలు భారీగా క్షీణించడంతో కనిష్ఠాల వద్ద మదుపర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు కనిపించడంతో సూచీలు రాణించాయి.